# ప్రణయసరణి

[కథానిక]

= శ్రీ 'రావుబాబు' =

౧. కుమార్

ప్రకృతి రామణీయకాన్ని అవలోకిస్తూ అలా ఎంత సేపు కూచున్నానో నాకు తెలియదు. నిజంగా సృష్టిలో యెన్నెన్ని వింత లున్నాయి! ఎంత ప్రశాంతాన్ని చేకూరుస్తుంది ప్రకృతిసౌందర్యం! కొండమీదినుండి కిందకు పారుతున్న ఆ సెలయేటి ప్రవాహము అస్తమిస్తున్న సూర్యకిరణాల్లో వింతవింత రంగులతో ప్రతిఫలిస్తూ ఎంత శోభగా కనిపిస్తున్నది! ఎత్తుగా గుట్టమీద నున్న నాకు కిందకు పోయే బాట చిన్నచిన్న మెలికలతో ఒక పెద్ద కొండచిలువలాగే కనిపిస్తున్నది.

అలా ఆ ప్రశాంతవాతావరణములో తన్మయుడనై వుండగా ఒక కిలకిలనవ్వు ఆనిశ్శబ్దాన్ని భేదించి నా తన్మయతని భంగపరచింది. నలుపక్కలా చూచేను. కొంచెము దూరములో యిరువురు యువతీమణులు—మణులనే చెప్పాలి—యేదో ముచ్చటించుకొంటూ, మధ్యమధ్య నవ్వుకుంటూ పైనుండి కొండబాటమార్గముగా దిగివస్తున్నారు. స్త్రీలు—అందులోనూ మగ సహాయం లేనిదే, అంత మీదకు యెందుకు వెళ్లేరా అని ఆశ్చర్యపోయాను. ఒకతె సుమారు ఇరవైఅయిదు సంవత్సరముల ప్రాయపుదై వుంటుంది. రెండవయామె నవయౌవ్వనముతో తొణికిసలాడుతూ పదిహేడు, లేక పద్దెనిమిది సంవత్సరములదానివలెకనిపించింది. ఇరువురూ అందంగానే వున్నారు. పెద్దామె ధరించిన గులాబీ రంగుచీరా, రెండోఅమ్మాయి కట్టుకున్న నీలిరంగుచీరా ఆపరిసరప్రాంతాల సౌందర్యాన్ని మరింత యినుమడిస్తున్నాయి. మాటలధోరణిలో వుండబట్టో, లేక నేను పక్కగా గుట్టమీద వుండడంచేతో వారు నన్ను చూసినట్టే లేదు.

వారు నన్ను దాటిపోగానే తిరిగివెళ్లేవేళ అయిందని హఠాత్తుగా నాకూ తోచింది. అంతకుముందు అత్యంతరమణీయంగా కనిపించిన ప్రకృతిదృశ్యాలన్నీ వుత్త సామాన్యమయినవీ, రోజూ చూస్తున్నవే కదూ అనిపించింది. నీటి ప్రవాహము వెనుకటి వేగము తగ్గి నీరసించిపోయినట్టుంది.

మొత్తముమీద అక్కడ మరి వుండబుద్ధిపుట్టక లేచి నిలబడ్డాను. కొంచెముదూరములోనే ఆ యిరువురు స్త్రీలూ ఒకరిచేతి నొకరు పట్టుకొని అతివిలాసంగా నడచిపోతున్నారు. ఆలోచించాను...వారి వెనకనే నడచివెళ్లితే బాగుంటుందా? అక్కడే యింకా కొంత సేపు కూచుందామా అంటే యెందుకోగాని మన స్సొప్పడక 'ముందుకు నడూ' అంటున్నది. నాకాళ్లుకూడా అట్టే ఆలోచన అవసరములేదని గుట్టదిగి బాటమార్గము పట్టేయి. కొన్నిగజాలు వెళ్లేనో లేదో బాటపక్కన జిగజిగ మెరుస్తూన్న వస్తువొకటి కనిపించింది. దగ్గరకి వెళ్లి తీసేను. అది ఒక ఉంగరము. అందులో ఒక నీలము స్థాపితమై చాలా అందంగా వుంది. అది తప్పకుండా వారిద్దరిలో ఎవరిదో అయివుండాలి. వారిది వారికిచ్చివేయడము న్యాయము...మనము వారి వెనకాలే వెళ్లిన ట్లెందు కుంటుంది? మనదారిన మనము వస్తున్నా మంతే!

చరచర నాలుగడుగులు ముందుకు నడచివెళ్లి "క్షమించాలి...ఈ ఉంగరము మీది కాదుకదా?" అని ప్రశ్నించేను.

ఇరువురూ గిరుక్కున వెనక్కు తిరిగిచూచేరు. ఇరువురూ తమతమ వేళ్లు పరీక్షించుకున్నారు. చిన్నమ్మాయి సౌందర్యము నిజంగా నన్ను ముగ్ధణ్ణే చేసింది.

ఆమె తత్తరపడుతూ "నాదే. ఎక్కడ దొరికింది?" అంది చేయి జాస్తూ.

ఉంగర మామెకు అందజేసేను...ఆమెచేయి నాచేతికి తగిలింది...ఆమెవైపు చూచేను... ఆమె కూడా నావైపు చూస్తున్నది! మాయిరువురివైపూ చూస్తున్న రెండవయామె పెదవులపై చిరునవ్వు మొలకెత్తింది.

"అయినా, వుంగరము వేలికి వుందో లేదో తెలుసుకోలేనంత మైమరపేమిటే? ఈయన గాబట్టి సరిపోయింది. ఇంకెవరయినా అయివుంటే నీ కది మళ్లీ దొరికేదా ?" అని మందలించిం దామె చిన్నమ్మాయిని.

ఉంగరాన్ని వేలికి ధరిస్తూ చిన్నామె తన కృతజ్ఞతను చిన్న మందహాసముతో తెలిపింది. ఆహాసము నాహృదయంలో దూరి చాలా గడబిడచేసింది! నీలి ఆకాశములోని పున్నమచంద్రునిలాగే కనిపించిం దప్పుడామెమోము!

వారిని అట్టేసేపు నిలబెట్టడ మెందుకని నేను కొంచెము వెనక్కు తగ్గేను. కాని వారు తిరిగివెళ్లిపోవడాని కేమీ ప్రయత్నించలేదు. నీలిచీర నన్నింకా తేరిపార చూస్తున్నట్టే వుంది! పెద్దామె నావైపు చూసి "మా చెల్లెలుతరఫున నేను మీకు ధన్యవాదా లర్పిస్తున్నాను. ఉంగరము చాలా ఖరీదయినది. పోయివుంటే ఏం చేసేదో అమ్మాయి!... తమకి చాలా శ్రమకలిగించేము. మీరు చేసిన ఉపకారానికి మే మెంతో కృతజ్ఞులము" అంది.

"శ్రమ యేముంది? నే నీమార్గాన దిగిపోతుంటే కనిపించింది. మీరుతప్ప నా కింకెవరూ కనిపించలేదీ చుట్టుపట్ల. మీ దే అయివుంటుందని తెచ్చేను. అంతే" అన్నాను.

పెద్దామె ఒక అడుగు ముందుకు వేస్తూ— "తమది ఈగ్రామమేనా అండి?" అని ప్రశ్నించింది.

"కాదు. విహారము వచ్చే నిక్కడికి. ప్రస్తుతము 'హిల్‌వ్యూ'హోటలులో బస"

"అరె! 'హిల్‌వ్యూ'లోనా? మేమూ అక్కడే వుంటున్నామే? ఆశ్చర్యంగా వుంది! ఒక్కచోట వుండీకూడా మనము ఒకరినొకరము కలుసుకోలేదింతకుముందు!"

"నే నివాళే వచ్చేను లెండి"

"ఇవాళే వచ్చేరా? కొన్నాళ్లుంటా రనుకుంటాను"

"అట్టేరోజు లుండను. ఈ ఆదివారమునాడే వెళ్లిపోవా లనుకుంటున్నాను"

ఇలా మాటాడుకుంటూ కొండ దిగి హోటలు చేరుకున్నాము ముగ్గురమూను.

* * * *

మర్నాడు ప్రాతఃకాలము ఏం తోచక 'గాబా' గారి పుస్తకము విప్పేను నాగదిలో పరుండి. ఎంతసేపయి చదువుతున్నానో గాని, తీసిన పేజీ తీసినట్టే వుండి మరి కదలనని భీష్మించుకొని కూచుంది. నాకు పుస్తకముమీద వుంటేకదా దృష్టి! ఈయిరువురు అమ్మాయిలు ఎవరు? వీరివెంట మరెవ్వరయినా వున్నారా, లేక వంటరిగా వచ్చివుంటారా అని ఆలోచిస్తున్నాను. ఎవ్వరయినప్పటికీ చాలా **forward and refined** (నవనాగరక) కుటుంబానికి చెందినట్టే కనిపిస్తోంది.

ఇంతలో హోటలు సేవకుడు యశ్వంత్ గదిలోకి ప్రవేశించి "బాబూ, మేడమీది బాబుగారు తమర్ని వేరే పని లేకపోతే ఒకసారి రమ్మని కబురంపేరు" అన్నాడు.

నేను దిగ్గున లేచి "బాబుగారా? ఎవరు? ఆయన పేరు?" అని ప్రశ్నించేను.

"రమాకాంత్ తివేరీటండి. ఎక్కడో మునసబులంట"

"వారివెంట యింకెవ్వరయినా వున్నారా?"

"ఎవరో యిద్ద రమ్మాయి లున్నారండీ"

"ఆఁహాఁ! ఎన్నో నెంబరుగది?"

"నెం. ౭ రు. కాని వారిప్పుడు గదిలో లేరండి. వెనుక తోటలో ఉన్నారు. తమర్ని అక్కడికే రమ్మన్నారు"

నేను తోటలోనికి వెళ్లేను. ఒకచోట ఒక చిన్న మేజాబల్ల. చుట్టూ నాలుగుకుర్చీలు వున్నాయి. ఒక

పురుషుమా, నేను సాయింత్రము చూసిన అమ్మాయిలలో పెద్దామే రెండు కుర్చీలలో ఆసీనులయివున్నారు. ఆ రెండోఅమ్మాయి నా కెక్కడా కనిపించలేదు.

రమాకాంతబాబు మర్యాదగా లేచి ఆహ్వానించే డొక కుర్చీని చూపుతూ.

"దయచేయండి, కుమార్ బాబూ! మావాళ్లవల్ల విన్నాను. తమకి మే మెంతో కృతజ్ఞులము" అన్నాడు, నా పే రెలా తెలిసిందో గాని.

మందహాసము చేసి ఒక కుర్చీ అలంకరించేను.

ఇంతలో మెరపు మెరసినట్టు ప్రవేశించింది చిన్నమ్మాయి, రెండుచేతుల్లో రెండు టీకప్పులు పట్టుకొని. నన్ను చూసిచూడగానే ఆ పిల్ల గుండె కొంచెము గతుక్కుమంది. ఆ తత్తరపాటులో పైట కొంచెము జారిపోయింది! రెండుచేతుల్లోనూ కప్పు లుండడముచేత సవరించుకుందుకి, పాపం, వీలులేకపోయింది. సిగ్గుతో మొగం ఎర్రబడింది. చప్పున టీకప్పులు రెండూ బల్లమీద పెట్టి, పైట సవరించుకొని అక్కవెనక్కి వెళ్లి నిలబడ్డది, ఓరకంటితో నన్ను చూస్తూ.

రమాకాంతబాబు చిరునవ్వుతో, "మనూ, ముగ్గుర మున్నాముకదా, రెండుకప్పులు తెస్తే ఎలా సరిపోతా యనుకున్నావ్?" అన్నాడు.

"నా కేం తెలుసు? ముందర చెప్పందే ఎలా తెస్తాను మూడు కప్పులు?" అని ఆమె కోకిలకంఠంతో జబాబిచ్చింది.

"ఏమో. ఈ రెండు కప్పులూ మాకు సరిపోయినాయి. మీఅక్కచెల్లెళ్లకి అవసరం లేకపోతే మానీవొచ్చు" అని ఒకకప్పు నాముందుకు తోసి తా నొక కప్పు దగ్గరగా లాక్కున్నాడు రమాకాంతబాబు. మనూ అన్న అమ్మాయి ఒకసారి తన అక్కవంక చూసి లోనికి వెళ్లింది.

రమాకాంతబాబు నావంక చూసి నవ్వుతూ "మీ రున్నారని వూరుకుందిగాని లేకపోతే ఫెడీమని జబాబు చెప్పేదేలెండి, మామరదలు: మిస్ మనోరమ! మా మురారా బాదుగరల్సు హైస్కూలులో ఈయేడు మెట్రుకి వెళ్తుందో లేదో అప్పుడే సరోజినీనాయుణ్ణి అయిపోయినా ననుకుంటోంది. తండ్రి చదివించాలి గాని అడ్వొకేటు అయిపోదామనే అమ్మాయిఆశయము!" అన్నాడు.

"ఏముంది, అదీ క్రమంగా ఒక మునసబు అవుతుంది" అని అందుకుంది అతని భార్య.

రమాకాంతబాబు ఒక గుక్క టీ తాగి "మీరు మునసబులయితే ఇహ వుందీ, ప్రతీకేసూ కొట్టేసి అందర్నీ ఎక్విట్టుచేసెయ్యరూ?" అన్నాడు.

"సహజసరళస్వభావులవడంచేత అంతే లెండి" అన్నాను నేను టీకప్పు బల్లమీద పెట్టి నవ్వుతూ.

అక్కకోసం టీకప్పు తెస్తున్న మనోరమ బావవంకా, నావంకా రెండుమూడుసార్లు చూసింది. రమాకాంతబాబు చెప్పినట్లు నేను లేకపోతే బావగారికి ఏదో ఘాటుగా జబాబు చెప్పేరకంలాగే కనిపించింది!

రమాకాంతబాబు వట్టికప్పును బల్లమీద పెడుతూ "మామిసెస్ మాలతి తివేరీమాత్రం హైస్కూలు స్టాండర్డుకి రాకుండానే పీటలమీది సరదా తీర్చుకుంటానని ఉబలాటపడిపోయిందిగాని—" అన్నాడు నవ్వుతూ.

"అవునవును" అని ఎగతాళిగా నవ్వి టీ సేవన కుపక్రమించిం దాతని భార్య.

టీ తాగుతూ మాలతి నావంక తిరిగి "కుమార్ బాబూ! తమరు వంటరిగా వచ్చినట్టుందే? వంటరిగా వస్తే ఈప్రదేశాల్లో ఏమానంద ముంది చెప్పండి?" అని ప్రశ్నించింది.

"ప్రస్తుతము మీరంతా వుండగా నా కొయిబ్బంది లేదుగా" అన్నాను నవ్వుతూ.

"అదికాదు. ఇంటివారుమాత్రం ఈ శీతలప్రదేశాలకు వచ్చి ఆనందింపకూడదా అని అడుగుతున్నాను"

"ఇంకా యింటివా రన్నవా రెవ్వరూ లేనప్పుడేం చెయ్యమన్నారు?"

"ఏమిటీ, తమ కింకా వివాహం కాలేదూ?" అని ప్రశ్నించేడు రమాకాంతబాబు.

"లేదండి. నాచదు వింకా పూర్తికాలేదు. ఇంతకూ ఏమంత తొందర? అదో బాదరబందీగాని!"

"ఏం చదువుతున్నారు?"

"మెడికల్"

"ఎక్కడ?"

"అలిఘర్‌లో"

భార్యవంక తిరిగి "చూశావా, ఇప్పటిరకం! చదువు పూర్తి అయితేనేగాని వివాహమాడరు!" అన్నాడు రమాకాంతబాబు.

"అవును మరి. అంతా మనలాగే—" అని అర్థోక్తిలోనే నవ్వింది మాలతి. మనోరమ వస్తూన్న నవ్వుని ఆపుకుంటోంది.

రమాకాంతబాబుకూడా నవ్వేడు. ఆతర్వాత నావంక చూసి "అసలు మీ గ్రామం?" అని ప్రశ్నించేడు.

"శహరన్‌పూర్"

"తమ తలిదండ్రులు —?"

"మా తండ్రి పోయారు. దివాన్ బహదూర్ బన్వారిలాల్. మీరు వినే వుంటారు."

"అరె! బన్వారిలాల్ కొమారులా మీరు! మీతండ్రి తెలీకేమి? మీ తండ్రిగారికీ, మా మేనమామ సుదర్శన పండిట్ గారికీ చాలా పరిచయం."

అక్కచెల్లెళ్లిద్దరూ నావంక కొంచెం తేరిపార చూసేరు.

"చదు వింకా ఎన్నేళ్లుంది?" అని ప్రశ్నించింది మాలతి.

"**Final year** (కడపటిసంవత్సరం) యిది"

"మరేం? ఇంకోఏడాది" అని నవ్వింది.

"దేనికి? పెళ్లికా లెఖ్ఖ వేస్తున్నావు?" అన్నాడు భర్త. మాలతి నవ్వి ఊరుకుంది.

"అంత ఉబలాటపడుతున్న దానివి ఏదయినా సంబంధం చూడు యిప్పటినుంచే" అని నవ్వేడు.

"అదేమంత కష్టమయిన పని! దివాన్ బహదూరు కొడుకు! డాక్టరు! సంబంధాలే రాకపోతా యేమిటి? ఈయన ఆ బాదరబందీ పడ్డానికి యిష్టపడాలిగాని?"

ముగ్గురం నవ్వేము.

ఇంతలో యశ్వంత్ వచ్చి "బాబూ, భోజనం సిద్ధమయిం" దన్నాడు.

అంతా లేచేము.

రమాకాంతబాబు నావంక చూస్తూ "అన్నట్టు మా పక్కనున్న గది ఇవాళ ఖాళీ అయింది. మీ బస అందులోకి మార్చేసుకుంటే?" అన్నాడు.

"అలాగే" అన్నాను.

* * *

భోజనా లయిన తర్వాత రమాకాంతబాబు "పేకాటసరదా వుందా" అని ప్రశ్నించేడు.

"లేకేమి" అన్నాను.

వెంటనే వారి గదిలో ఆడడానికి అంతా సిద్ధమయినాము.

రమాకాంతబాబు భార్యవైపు తిరిగి "చూసేవా! పార్టినరుని తీసుకొచ్చాను. ఇక మరి '౫, ౩, ౨' ఇబ్బందిలేదు" అన్నాడు.

మాలతి నవ్వుతూ "అవునుగాని, అంతా మీ గొప్పలా చెప్పుకుంటున్నారు! ఈయన పార్టినరుగా దొరకడానికి మీరు కారకులు కారే?" అంది.

"ఏమీ?" అని అమాయికంగా ప్రశ్నించాడు రమాకాంతబాబు.

"మీకు ఈయనపరిచయం కలగజేసిం దెవరు?"

మనోరమ తన ఉంగరా న్నొకసారి సవరించుకొని వూరుకుంది. అది బావగారి కంట పడినట్టేవుంది.

రమాకాంతబాబు భార్యవంక తిరిగి "అంతగా వస్తే ఇందులో నీ నిర్వాక మేముంది? మనోరమే ఉంగరం పారెయ్యకపోతే—" అంటూ నవ్వసాగేడు.

'వేలం' వొద్దంటాడు రమాకాంతబాబు. 'బ్రిడ్జి' రాదంటుంది మనోరమ. చివరికి నలుగురిలో

'అడ్డు' ప్రారంభించేను. నేనూ మాలతీ ఒకపార్టీ; బావా మరదళ్లు ఒకపార్టీ.

ఆడుతున్నంతసేపూ ఏదో హాస్యం చేస్తూనే వున్నాడు రమాకాంతబాబు మనోరమను.

* * *

సాయింత్రము టీ పుచ్చుకున్న తర్వాత మాలతి నాగది ప్రవేశించి "కుమార్ బాబూ, కొండమీదికి వెళ్దాము వస్తారా ?" అంది.

"సరే పదం" డన్నాను.

ఆమె తమనౌకర్ని పిలిచి "గోపీ, బాబుగారు వస్తే మీదకు షికారు వెళ్లేమని చెప్పు. వేళుండగా వస్తే ఆయన్నుకూడా రమ్మను." అని తమ గది వంక నడచి "మనూ, తయారయావా ?" అని హెచ్చరించింది చెల్లెల్ని.

ముగ్గురమూ హోటలు వదలి బయలుదేరేము.

"రమాకాంతబాబు యెక్కడికి వెళ్లే" రని ప్రశ్నించేను మాలతిని.

"'సేవాయి' హోటలులో ఇవాళ వాళ్లజడ్జీ, పెళ్లాం దిగేరుట. కలుసుకుందుకి వెళ్లేరు. వెళ్లి చాలా సేపయిందిలెండి. మనము వెళ్తుండాము. వస్తే కొంచెము సేపట్లో కలుసుకుంటారు."

కాలిబాట ననుసరించి కొండమీదకు వెళ్లి, నే నాకిందటిరోజు కూర్చున్న గుట్టమీదకే యెక్కేము ముగ్గురమూను. కొంతసేపటివరకూ యెవ్వరమూ మాట్లాడలేదు. ఆ సెలయేటినీ, పరిసరప్రాంతాల సౌందర్యాన్నీ అలా చూస్తూ కూచున్నాము.

ఏదో ప్రసంగంకోసము "ఆ నీటి ప్రవాహాన్ని చూడండి. ఎలా దుముకుతూ పోతోందో కిందకి" అన్నాను నేను.

"అవును. ఇటువంటి ప్రకృతి దృశ్యాలే కవులకు భావోద్రేకాన్ని కలిగిస్తాయనుకుంటాను" అంది మాలతి.

"నిజమే. ఇప్పుడు నేనే ఓ కవినయివుంటే, ఈ రాళ్లనీ రప్పలనీ దాటుకోపోతున్న ఈ ప్రవాహానికీ, అడుగడుక్కీ గండాలతో కూడుకున్న మానవ జీవితానికీ సాదృశ్యము కల్పించి ఓ గీతము అల్లివుందును !" అని నవ్వుతూ అన్నాను.

"ఇంకేమి ? మీకూ కొంచెము కవిహృదయమున్నట్టుందే !" అని నవ్విందామె.

ఇంతలో వారిసేవకుడు గోపీ వచ్చి "బాబుగారు మిమ్మల్ని తొందరగా రమ్మంటున్నారు. ఎవరో దొరా, దొరసానీ వచ్చేరు." అన్నాడు మాలతివైపు చూస్తూ.

"అలాగా ? నడు నడు" అని మాలతి మావంక చూసి "మీ రిక్కడే వుండండి. ఇప్పుడే వస్తాను." అంది గుట్టదిగి పోతూ.

"నేనుకూడా వస్తానే" అని లేచింది మనోరమ.

"బాగుంది ! ఎవరొచ్చేరో యేమిటో, నువ్వెందుకే. నే నిప్పుడే వచ్చేస్తానుగా" అని గోపీవెంట వెళ్లిపోయింది మాలతి.

మనోరమ దిక్కులుచూస్తూ కూచుంది. ఇద్దరమే వున్నాము! చుట్టూ నిర్జనప్రదేశము ! మనసులో అనేకవిధములయిన ఆలోచనలు పరుగెడుతున్నాయి. తీరిగ్గా ఆమెముఖసౌందర్యము చూడ్డానికూడా ఎందుకో జంకుపడుతోంది మనసు ! ఏదయినా ప్రసంగము ఎత్తుదామంటే ఒక్క విషయముకూడా స్ఫురణకి రావడములేదు.

నేను లేచి నిలువబడ్డాను. ఆమె ఉలిక్కిపడి నావంక చూసి "వెళ్లిపోతున్నారా ?" అంది. కోకిల కంఠం అంత మధురంగా వుంటుందంటే నేనునమ్మను.

"అబ్బే! లేదు. మీ అక్కావాళ్లు వస్తున్నారేమో అని చూస్తున్నా" నంటూ కూచున్నాను యథాస్థానంలో. మళ్లీ కొంత నిశ్శబ్దము.

కొంతసేపటికి ఆమె తన ఉంగరము సర్దుకుంటూ "మీకు సెలవ లింకా యెన్నాళ్లున్నాయి" అని ప్రశ్నించింది.

"సుమారు రెండువారాలున్నాయి. అంతే"

కొంత ఇంటర్వలు ! నాటర్న్ వచ్చింది. ఏమడుగుదామా అని బుర్ర చితకగొట్టుకొని చివరికి

"మీ మురాదాబాదు గరల్సుస్కూలులో బాగా చెప్తారా పాఠాలు?" అని ప్రశ్నించేను.

"బాగానే చెప్తారు. మాది గవర్నమెంటు స్కూలు" అన్న దామె.

మళ్లీ కొంతవరకు ఎవ్వరమూ మాటాడలేదు. వుండివుండి ఆమే ప్రశ్నించింది: "మీరు డాక్టరీకి యెందుకు వెళ్లేరు? ప్లీడరీ పేసయివుంటే ఏమునసబో అయివుందురే!"

నాకు నవ్వువచ్చింది. "అంతా మీ బావలాంటి అదృష్టవంతులే వుంటారా? ఇంతకూ డాక్టరీకంటె ప్లీడరీ యేమంత ఘనము?"

"డాక్టరుపని అసహ్యముపెయ్యాను? మను ష్యుల్ని కొయ్యడము-అబ్బ!"

"పరోపకారముకోసము ఇన్ని పాట్లున్నా."

మళ్లీ ఇంటర్వలు! కొంతసేపువరకూ యిద్ద రమూ వూరుకున్నాము.

"ఇంతసేపయినా మా అక్కా, బావా రాలే దేమి చెపుమా?" అం దామె కొండబాటవంక చూస్తూ.

"ఏదో మాటాడుతూంటారు ఆ దొరలతో. వారు రాకపోయినంతమాత్రాన బెంగ యెందుకు?"

"వస్తే మీకు—?" అని అర్ధోక్తిలో నావంక చూసింది.

ఏవుద్దేశముతో అంది చెప్మా అని ఆమెవంక ప్రశ్నార్థకంగా చూసేను. ఆమె పక్కున నవ్వింది.

కొంతసే పూరకుండి "ఉంగరం చాలా ఖరీ దయిందికదూ?" అన్నాను.

"అవును. తిరిగి యిచ్చేసినందుకు విచారిస్తు న్నారా?"

"ఏదీ? సరిగ్గా చూడే లేదు."

"ఈసారి లాక్కుంటారేమో?" అంటూ తీసి ఇచ్చింది తన వుంగరాన్ని.

నే నది వేలికిపెట్టుకొని "సరిగ్గా అమర్చినట్టు సరిపోయిందిసుమా" అన్నాను నవ్వుతూ.

"సరిపెట్టుకుంటే!" అం దామె చిరునవ్వుతో

మళ్లీ కొంతవరకు యిరువురమూ మౌనము వహించేము.

ఆమె తిరిగి ప్రశ్నించింది: "రేపు ఆదివారము నాడా మీ ప్రయాణము?"

"అవును."

"సరాసరి అలీఘరు వెళ్తారా?"

"లేదు. డెహ్రాడూనులో ఒకటిరెండురోజు లుందా మనుకుంటున్నాను. మామిత్రు డొకడక్కడ ఫారెస్టుకాలేజీలో చదువుతున్నాడు. వచ్చేటప్పుడు చూడ్డం అయిందికాదు. అతన్ని కలుసుకొని మరీ పోతాను."

"మరీ అంత తొందర పని లేకపోతే మీరు బుధవారందాకా వుండిపోకూడదూ? అంతా కలిసి వెళ్లిపోవచ్చును"

ఆమెవంక చూసి నవ్వేను.

"సరే దానికేమిగాని నీకు 'కేరాఫ్ మురాదా బాదుగరల్సస్కూల్' అంటే వుత్తరాలందుతాయా?"

"ఏమి, ఉత్తరాలు రాస్తారేమి" అంది కొంచెము ఆశ్చర్యంతో.

"రాయకూడదా?"

"కూడదని కాదు. కాని స్కూలు కెందుకు? మా బావఎడ్రస్సుకి రాస్తే వచ్చేస్తాయి."

ఇంతలో చిన్న చినుకు ప్రారంభించింది. మనో రమ లేచి "వాన పడుతోంది. పోదామా?" అంది. నేనూ లేచేను.

నేను గుట్ట దిగేను. తొందరగా దిగడములో పాపం ఆమెకాలు జారింది. చప్పున ఆమెచేయి పట్టు కొని తాప్పీగా దింపేను. కిందకు దిగి చేయి విడిపించు కోకుండానే నాకళ్లల్లోకి చూస్తోంది. చేయి వద లెయ్యాలన్న జ్ఞానము నాకూ కలుగలేదు! మంత్ర ముగ్ధుడిలా ఆమెవంక చూస్తూ నిలబడ్డాను ...... అదో మధురమయిన ఘడియ!

చినుకులు కొంచెము జోరుగా పడ్డం మొదలు పెట్టేయి. ఆమే చెయ్యి విడిపించుకుంది. ఇరువురమూ ప్రయాణము సాగించేము.

"ఇదిగో ఇక్కడే నిన్న ఉంగరం దొరికింది నాకు" అని ఆస్థలం చూపించేను.

"నిన్న ఉంగరము పోయి మళ్లీ దొరికింది. కాని ఇనాళ ఉంగరముతోపాటు–"ఆ పైముక్క యేమిటని ఆమెకళ్ల నాతృతగా అడుగుతున్నాను. ఈలోగా పెద్ద గాలీవాన ప్రారంభించింది. ఎక్కడయినా తలదాచుకుందికి స్థలము దొరుకుతుందా అని నలుపక్కలా చూసేను. కొంచెము దూరములో ఒక చిన్న గుడిసె కనిపించింది. ఇద్దరమూ నాలుగడుగుల్లో ఆగుడిసెను చేరి తలుపుతీసుకొని లోనికి ప్రవేశించేము. లోన ఎవరో యోగి కళ్లు మూసుకొని కూచొనివున్నాడు. గుడిసెలోకి మాతోపాటు చలిగాలి రయ్యిమని ప్రవేశించింది. యోగికి నిద్రాభంగ మయినట్టుంది. కళ్లు తెరచి మమ్మల్ని చూసేడు. నేను గుడిసెతలుపు మూసివేసి ఎందుకయినా మంచిదని ఆయనకు నమస్కరించేను. "శీఘ్రమేవ మనోరథప్రాప్తిరస్తు" అని మనోరమవంక చూసేడు. పాపం, తడిసిపోయిన బట్టలతో వణకుతూ నిలబడ్డది మనోరమ.

ఇంతలో పైన గోపీస్వరము వినవచ్చింది. "అమ్మా మనోరమమ్మా! ఎక్కడున్నారు?" అని అరుస్తూ పరుగెడుతున్నాడు. "ఇక్కడున్నాము ఈ కుటీరములో, ఇలా రా" అని కేక వేసింది మనోరమ.

గోపీ తడిసి ముద్దయి గొడుగుతోసహా ప్రవేశించేడు. "అమ్మయ్య! మీా రెక్కడుండిపోయినారో అని బాబుగారూ, అమ్మగారూ పంపించేరు నన్ను" అని వగర్చుకుంటూ చెప్పేడు.

"ఒక్కగొడుగులో ఎలా వెళ్తాము?" అంది మనోరమ నన్ను చూస్తూ.

యోగి ఎందుకో నవ్వేడు. "భయపడకమ్మా. ఎంతసే పుంటుంది వర్షము? ఈమాత్రపు కష్టానికే అడిలిపోతే యెలా? ఆసెలయేటిని గమనించేరా?" అన్నాడు ఇరువురివంకా చూసి, దూరంగా చేయి చూపుతూ. ఇరువురమూ కిటికీలోనుంచి కనిపిస్తున్న సెలయేటివంక చూసేము.

"ఎన్నిరాళ్ల మధ్యనుంచి ప్రవహిస్తున్న దది? ఎన్నిగుట్ట లడ్డుపడతాయి దానికి?...దాని ప్రవాహము ఆగిపోతుందా?...మీా జీవితమూ ఒకప్రవాహమే. రేపు ఎన్నికొండలు దానికి అడ్డుతగులుతాయో, ఎన్ని ఝుంఝామారుతాల కది ఆలవాల మౌతుందో ఎవరు చెప్పగలరు?...ధైర్యంతో ఎదుర్కొవాలమ్మా. దేనికయినా ధైర్యం వహించాలి."

ఈలోగా వర్షం పూర్తిగా తగ్గిపోయింది. ఏదో కొంతవేదాంతము యేకరువు పెట్టినందుకు వచ్చేముందు యిరువురమూ అతనికి నమస్కరించేము. చేయియెత్తి "శీఘ్రమేవ కల్యాణసిద్ధిరస్తు"అని మళ్లీ యోగనిద్రలో మునిగేడు.

నా కర్థముకాలే దాదీవన ఎవరికో! మనోరమ కూడా కొంచెము తత్తరపడినట్టే వుంది.

## ౬. మనోరమ

యోగియుద్దేశము నాకు సరిగా అర్థ మవలేదు గాని ఎందుకో చెప్పరానంత సిగ్గు వేసింది. గోపీ మా అక్కాబావలతో ఏమిటి చెప్తాడో అన్న భయముకూడా వేసింది.

ఎవరితో ఎవరమూ మాటాడకుండా హోటలు చేరుకున్నాము.

"చల్లబడి వొచ్చే రిద్దరూ"అని హాస్యంచేశాడు మా బావ.

ఆనాటినుంచి నాకు కుమార్ బాబుమొహం చూడ్డానికే సిగ్గువేసేది.

* * *

మర్నాడు భోజనాలయాక మా అక్కా, బావా గదిలో మాటాడుకుంటున్నారు. నేను పైనుండే వింటున్నానంతా.

"యోగిఆశీర్వాదబలంకూడా వుంది. ఇక ఆలస్యమెందుకు? మీాతండ్రికి కన్యాదానఫలము దక్కకుండా గాంధర్వవివాహము జరిగిపోగలదు" అన్నాడు మా

బావ తన సహజహాస్యధోరణిలో. నే ననుకున్నట్టే అయింది. ఈగోపీవెధవ అంతా చెప్పేసుంటాడు!

మా అక్కగొంతుక వినిపిస్తోంది: "నిజమే గాని అక్కడ మానాన్న వేరేసంబంధము కుదిర్చేశాడా అంటే చిక్కువస్తుంది. మేము వచ్చేటప్పటికి ఏవో ఆమాటలే జరుగుతున్నట్టున్నాయికూడాను"

"అలాగా? అయితే మీ చెల్లెల్ని ముఖాముఖి అడిగిచూడు. నేను కుమార బాబుని కదిపించిచూస్తాను."

"కనిపిస్తుంటే ఇంకా అడగడ మేమిటి? అదీగాక...ఉంగరము...అతని చేతి కుంది చూశారా?"

"ఆఁహాఁ! అయితే ఇవాళే మీవాళ్ల కొక ఉత్తరము రాసికూడదూ— మనూ పెళ్లి విషయములో ఎవ్వరికీ మాట యిచ్చీవద్దనీ, ఇలా మే మిక్కడ ఒకవరుణ్ణి చూసేమనీ?"

మాబావ యెందుకో పైకి వస్తుండడము చూసి నేను వరండాలో పచారుచేస్తున్నట్టు సాగిపోయాను మెల్లిగా.

పక్కనే వున్న నెం. ౬ రు గదిద్వారమువద్ద అప్రయత్నంగా ఆగి లోనికి చూచేను. పడకకుర్చీలో కూర్చొని ఏదో పుస్తకము చదువుకుంటున్నాడు కుమార్. నన్ను చూసేడు. "పేకా టుందా ఇవాళ?" అని ప్రశ్నించేడు. నేను "ఏమో"అని మెల్లిగా జవాబు చెప్పి ద్వారందాటి సాగిపోబోతున్నాను.

కుమార్ కుర్చీలోంచి లేచి "ఏమంత దూర దూరంగా వెళ్లిపోతున్నా" వన్నాడు.

నే నేం చెప్పడానికీ తోచక నిలబడి చూస్తున్నాను. ఇంతలో మాఅక్క అక్కడకువచ్చి మాయిరువుర్నీ చూసింది. ఏమిటనుకుందోగాని. నేనేమిటో తప్పు చేసినట్టే అనిపించి అక్కడుండలేక నాగదివైపు కాళ్లు మరల్చేను. మాఅక్క మొగంలో చిరునవ్వు కనిపించింది. "మనూ, లెటరుపేపర్లు నీపెట్టెలో పెట్టుకున్నావు కాబోలు. రెండు తీసి ఇయ్యి. ఉత్తరం రాయాలి" అంది.

నేను నాగదిలోకి వెళ్లకముందే పోస్టుబంట్రోతు "రమాకాంతతివేరీగా రెక్కడ?" అని కింద ఎవర్నో అడగడము వినిపించింది. మాబావ లేవబోతూండగా నేనే పరుగెత్తుకొని వెళ్లి మెట్లెక్కివస్తున్న పోస్టుబంట్రోతుచేతిలోని ఉత్తరాన్ని తీసుకొని మళ్లీ నాగదిలోకి పరుగెత్తి వెళ్లిపోయాను. మాబావ ఉత్తరము కోసము చేయి జాచి, నే నివ్వకపోగా "పోనీ, అదేదో నువ్వే జాగ్రత్తీసుకో" అని మళ్లీ కుర్చీలో కూలబడ్డాడు.

ఉత్తరము పూర్తిగా చదివేటప్పటికి నాకు కళ్లు చీకట్లుకమ్మేయి. మారు మాటాడకుండా ఆ వుత్తరము మాఅక్క కందిచ్చేను. మాఅక్క అది చదివి మాబావ దగ్గరకి వెళ్లి "నే ననుకున్నంతా అయింది. వచ్చేనెల నాలుగో తేదీన మనూకి పెళ్లి! వెంటనే రమ్మని రాసేరు మానాన్న" అంది.

"అరె! ఇంతవేగంగా ఎలా స్థిరమయిపోయింది చెప్మా? అయినా నువ్వు ఇంతకుముందే రాయవలసి వుండెను సుమా"

"బాగుండి! నేనా ఆలస్యముచేశాను? వాళ్లనడును వీళ్ల నడును అని మీరే చివరదాకా రాయనిచ్చేరు కారుగాని"

"పెళ్లికొడుకు ఎవరో ఏమయినా వుందా?"

"ఆ సంగ తేమీ లేదు ... పాపం, మనూ మొహం చూడండి, ఎలా వాడిపోయిందో!"

"వెంటనే ఉత్తరం రాసిపడెయ్యి. ఇక్కడిలా వుంది. ప్రస్తుతముహూర్తం ఆపుచెయ్యమనీ, మేము కుమార్ బాబుతో వస్తున్నా మనీ ... వేళలేదు. ఇవాళ ఇరవైతొమ్మిదో తారీకా, ఇంకా అయిదు రోజు లుం దంటే" అన్నాడు మాబావ.

"కుమార్ బాబు ఇవాళ సాయింత్రము వెళ్లిపోతాడు కాబోలునే!"

అదేమిటో అప్రయత్నంగా నా నోటినుంచి "లేదు" అని వచ్చేసింది. నాలుక కరచుకొని వూరుకున్నాను.

భార్యాభర్త లిరువురూ ఒకరిమొఖ మొకరు చూసుకున్నారు.

ఇంతలో కుమార్ "ఇవాళ పేకాట లేదా యేమి" టన్నాడు అందరివంకా చూస్తూ.

"ఏం చెప్పేది కుమార్ బాబూ. మా యింటి నుంచి ఉత్తరం వచ్చింది. దాంతో మాసంతోషమంతా భంగమయింది" అంది మాఅక్క.

"ఏమని వచ్చింది వుత్తరము?" అని ఆశ్చర్యంగా ప్రశ్నించేడు కుమార్.

"మామనూకి రేపు నాలుగోతారీకున పెళ్లి అని మా నాన్నగారు వ్రాసినారు."

"మనూకా?" అని కుమార్ కొంచెము గతుక్కుమన్నాడు. కాని వెంటనే ముఖభావాల్ని మరుగుపరచి సంతోషాన్ని వెలిబుచ్చ ప్రయత్నించేడు. ఆ ప్రయత్న మంత సఫలమవడము లేదని మాఅక్కా, బావా కనిపెట్టినట్టే వుంది.

మా అక్క మాబావవంక ఒకసారి చూసి మళ్లీ కుమార్ వంక తిరిగి అన్నది: "కుమార్ బాబూ, ఇక దాపరిక మెందుకు? మీ యిరువురివిషయమూ గమనించేము. మన మొకవిధంగా అనుకుంటే చివరకింకో విధంగా పరిణమిస్తున్నట్టుంది."

* * *

మా అక్క రాసిన ఉత్తరానికి జబాబుగా మర్నాడు టెలిగ్రామే వచ్చింది మానాన్నదగ్గరనుండి. సంబంధము రద్దుచెయ్యడానికి వీల్లేదనీ, పెళ్లి జరిగి తీరాలనీ, మమ్మల్ని వెంటనే రమ్మనీ వుంది దానిలో.

మా అక్క ఆ టెలిగ్రాము చూసి "ఇహ మా నాన్నకి ఉత్తరములలో బోధపరచడం కష్టము. స్వయంగా వెళ్లి మా అమ్మతో అంతా చెప్తేనేగాని కాదు. ఇవాళే ప్రయాణము. ఏమంటారు?" అంది మగనితో.

"అయితే వేగం తెమలాలి. సాయంత్రం ఆరు గంటలకయినా బయలుదేరితేనేగాని డెహ్రాడూన్ ఎక్స్‌ప్రెస్‌ని అందుకోలేము ... కాని కుమార్ బాబు ప్రయాణముసంగ తేమిటి?"

మా అక్క వెళ్లి కనుక్కుంది. "నేను మాత్రము వంటరిగా ఇక్కడెందుకు? నేనూ బయలుదేరుతున్నా" నన్నాడు కుమార్.

* * *

సాయంత్రము మా అక్కా, బావా కలిసి బజారుకు వెళ్లారు రిక్షామీద మా బావచెల్లెలి పిల్లలకోసము ఏవో ఆటవస్తువులు మొదలయినవి కొనడానికని. తలనొప్పిగా వుందని వుండిపోయాను నేను, హోటల్లో. వారు రమ్మని అట్టే బలవంతపెట్టలేదు కూడాను.

గదిలో ఏం తోచక పడుకున్నాను. ఎవరో గది ప్రవేశించినట్లయింది. వెనక్కు తిరిగి చూచేను. కుమార్! లేచి కూచున్నాను.

"మనూ!"

అలా పిలవడమదే మొదటిసారి. నేను తలయెత్తి చూచేను.

"వంట్లో బాగులేదూ?"

"లేకేమి?"

"నావద్ద నీవస్తువొకటి వుండిపోయింది."

"ఏమిటది?"

"నీ వుంగరము నా దగ్గరే వుంచుకుంటే నీ కేమయినా అభ్యంతరమా?"

"లేదు. కాని మీ కెందుకది?"

"నీ జ్ఞాపకార్థము"

కొంతసేపు ఎవ్వరమూ మాట్లాడలేదు. కుమార్ కొంచెము గంభీరంగా అన్నాడు: "మీ అక్క ప్రయత్నము ఫలించలేదని తెలిసినవెంటనే నీ ఉంగరము నీకు పంపించడానికి నా కేమీ అభ్యంతరము లేదు."

నా కేమి జబాబు చెప్పడానికీ నోట మాట రావడములేదు. కుమార్ ఒక కాగితము నాచేతిలో పెట్టేడు.

"ఇదిగో నా డెహ్రాడూను ఎడ్రస్సు యిస్తున్నాను. మీ గ్రామం వెళ్లిం తర్వాత జరిగిన వివరాలు నాకురాస్తే సంతోషిస్తాను. నీ వుత్తరం వచ్చిందాకా నేను డెహ్రాడూనులోనే వుంటాను."

"అలాగే" నన్నాను ఆ కాగితాన్నందుకుంటూ.

* * *

సాయంత్రము సుమారు ఆరుగంటలకి మూడు రిక్షాలలో బయలుదేరేము. మాఅక్కా, నేనూ ఒక

రిక్షాలో; మా బావా, కుమార్ రెండవదానిలో; మిగతా సామానంతా మూడోరిక్షాలోను. 'సన్నీవ్యూ' చేరే సరికి ఏడున్నర అయింది. అక్కడినుంచి టాక్సీచేసు కొని ఎనిమిదిన్నరకి డెహ్రాడూన్ ఎక్స్ప్రెస్‌ని అందుకున్నాము.

ప్లాటుఫారములో రైలు వెళ్లిందాకా నిలబడ్డాడు కుమార్. మా బావ అతనితో ఏదో మాటాడి వచ్చి బండీ ఎక్కేడు. మా అక్కకూడా అతన్ని చూస్తూ "మా శాయశక్తులా ప్రయత్నిస్తాము. ఆ పైని మన అదృష్టము" అంది.

రైలు కదిలింది. కుమార్ మా బావాఅక్కల వద్ద సెలవు పుచ్చుకొని నావంక చూస్తూ నిలబడ్డాడు. రైలు ప్లాటుఫారము దాటిపోయింది ... అతను ఇంకా నావైపు చూస్తూనేవున్నాడు. రైలు మలుపుతిరిగి పోతున్నది. స్టేషనుదీపకాంతుల్లో అతని వ్రేలికున్న ఉంగరము తళుక్కుమని మెరిసింది. ఆ తర్వాత స్టేషను అగోచరమైపోయింది.

* * *

మా బావ మురాదాబాదులో దిగకుండా రాత్రి మాకు సహాయంకోసము సరాసరి మా 'రాంపూర్'వచ్చే సేడు.మా యింటికి వెళ్లేసరికి రాత్రి మూడుగంటలవడం చేత ఎవ్వరమూ ఏమీ మాటాడకుండా పడుకున్నాము.

ఆ మర్నాడే కోర్టుపని కొంత చేసుకోవాలని మాబావ పేసింజరులో మురాదాబాదు వెళ్లిపోయినాడు.

మా అక్క మా అమ్మతో జరిగిందంతా చెప్పి "మనూసుఖము కావలిస్తే ఈ సంబంధము తప్పించేయండి. కుమార్ మనూలే దంపతు లౌతారని అక్కడ ఒక సిద్ధునివాక్య ముంది." అని ఎలాగో మా అమ్మని తనపక్కకు తిప్పుకుంది.

మాతండ్రిమాత్రం పట్టినపట్టు విడిచే రకంగాదు. "మాట యిచ్చి కారణములేనిదే సంబంధము తప్పించేస్తే నా మొహమ్మీద నలుగురూ వుమ్మరూ? ఇంతకూ పెళ్లికొడుకుని చూడండే ఏమి టీగోలంతా? గొప్పింటి బిడ్డడు. తల్లీ, తండ్రీ, అన్నదమ్ములూ ఎవరూ లేరు. పెద్ద ఆస్తి. ఏమయిం దేమిటి?" అని కూచున్నాడు మా నాన్న.

"పోనీ, ప్రస్తుతముహూర్తానికయినా తప్పించేస్తే వెనుకనుంచి చూసుకోవచ్చు"నంది మాఅమ్మ.

"ఏమిటి చూసేది వెనుకనుంచి, నీ—"

మా నాన్నకి కోపం వస్తే ఎంతమాటపడితే అంతమాటా అనేస్తారు మాఅమ్మను. కాని ఆనాడు మేమున్నామని కాబోలు ఊరుకున్నారు.

"పిల్లకి వంట్లో బాగులేదంటే పెండ్లి జరిగే తీరాలని కూచుంటారా పెళ్లివారు?"

"అవును, అసలు ఆకుమార్‌బాబు బంధువులు వప్పుకుంటారో లేదో ఏమీ తెలీకుండా—"

"ఏమయినా ఈ ముహూర్తానికి కాదు. పిల్ల బెంగపెట్టుకున్నది. ఆమాట మీాయిష్టము." అని మా అమ్మ వంటింట్లోకి వెళ్లిపోయింది.

చివరికి ఎలాగయితేనేమి పిల్లకి చాలాసుస్తీగా వుండడంచేత ప్రస్తుతముహూర్తానికి తూగలేమని టెలిగ్రాము యిప్పించకతప్పిందికాదు మా నాన్నకు. పర్యవసానం ఎలా తేలుతుందో అనే భయంమాత్రము నన్ను వదల్లేదు. కుమార్‌బాబుకోరికప్రకారము అతనికి వుత్తరము రాయ మొదలుపెట్టేను.

"మార్కెటురోడ్డు,
రాంపూర్, ౧-౭-౪౧.

—దివ్యసన్నిధికి,

దైవకృపవల్ల ప్రస్తుతముహూర్తము తప్పిపోయింది. తర్వాత ఏం జరుగుతుందో తెలీదు. నాడు యోగి అన్న మాటలు తార్కాణానికి వస్తున్నట్టున్నాయి. కొండమీాద పుట్టిన ప్రతీ వాహినికీ ప్రారంభములో ఒడిదుడుకులప్రయాణము తప్పనప్పుడు కొండమీాదే పుట్టిన ప్రేమ వాహినికిమాత్రం తప్పుతుందా?

మన విషయములో శ్రమతీసుకుంటూన్న మా అక్కకీ, బావకీ మన మెంతో కృతజ్ఞులముగా వుండాలి. —మనోరమ"

రెండుమూడుసార్లు చదువుకొని కవరులో వేసి అంటించేను. పైని ఎడ్రసు రాదామని అతనిచ్చిన కాగితముకోసము పెట్టె అంతా వెదకేను. ఏమయిందో గాని అది నా కెక్కడా కనిపించలేదు. చివర డెహ్రా డూన్ అన్న ముక్క తప్ప పూర్తిఎడ్రసు నేనప్పుడు సరిగా గమనించలేదు. డెహ్రాడూన్‌లో యెక్కడుంటాడని రాయను? చివర కొక్కటే ఆలోచన తట్టింది. వేళకు నావుత్తరం రాకపోతే అత నెలాగా రాయకపోడు. ఆవుత్తరములోని అతని ఎడ్రసు చూచి అప్పుడు రాయవచ్చునని నిట్టూర్పు విడిచి వూరుకున్నాను, మరేం చెయ్యడానికీ తోచక.

*    *    *

అనుకున్న ముహూర్తము దాటి మూడురోజులై పోయింది. పెళ్లివారి కేమయినా రాయకపోతే బాగుండదని మానాన్న ఆలోచిస్తూనేవున్నాడు. రెండు వుత్తరాలు వచ్చేయి. ఒకటి మానాన్నకి. ఆయనకి తప్పిపోయే—పొరబాటు, తప్పిపోనున్న—అల్లుడి వద్దనుంచి వచ్చింది. తాను పనిమీద కలకత్తా వెళుతూ తోవలో మావూరులో దిగుతాననీ, నా వంటిస్థితి చూచి మరేమీ యిబ్బందులు లేకపోతే వీకంగా పెళ్లి ముహూర్తమే స్థిరపరుస్తే మంచిదనీ సారాంశము.

రెండవది మాబావదగ్గర్నుంచి వచ్చింది మా అక్కకి. ఆ ఉత్తరములో కుమార్ బాబు మురాదాబాదు ఎడ్రస్సుకి రాసిన ఉత్తరము పంపించేడు మా బావ. అంతదాకా మ పుట్టింటి ఎడ్రస్సు కుమార్ బాబుకి మే మెవ్వరమూ చెప్పేలేదన్న సంగతి నాకు జ్ఞాపకము రాలేదు. మాఅక్క ఆ ఉత్తరము చదివి నావంక అదోమాదిరిగా చూసి నా కిచ్చిందావుత్తరము. చదువుకున్నాను.

"డెహ్రాడూన్,
౬-౭-౪౧.

పూజ్యురాలయిన వదినెగారి సన్నిధికి,

అనేకప్రణామములు. ఇప్పటివరకూ మీఉత్తరముకొరకు చూసిచూసి ఇప్పుడు యిది రాస్తున్నాను. మీరంతా నన్ను పూర్తిగా మరచిపోయినట్టుంది. జూలై నాలుగోతారీకు దాటి రెండురోజు లవుతున్నా మీవద్దనుండి ఏవిధమయిన సమాచారముగాని లేనందున శుభకార్యము సానుకూలంగా జరిగేవుంటుం దని భావిస్తున్నాను. చాలాసంతోషమయిన విషయము. భగవంతు డానూతనదంపతులకు శ్రేయ మొనర్చుగాక. అన్నగారికి నాసేవింపులు.

—కుమార్.

కలంతాజా:—మీ ప్రయాణపు తొందరలో మీ తండ్రిగారి ఎడ్రస్సు అడగమరచేను. అన్నగారు మీకు దీనిని అందచేస్తా రన్న ఆశతో మురాదాబాదుకే రాస్తున్నాను.

—కుమార్"

కుమార్‌కి కలిగించిన వ్యథకి నన్ను నేను శపించుకున్నాను. మనూని కృతఘ్నురాలినిగా యెంచుకొని వుంటాడు! తిరిగీ వుత్తరము రాదామంటే పూర్తి ఎడ్రస్సు ఎక్కడా నా కగుపించలేదు! మేము అతనికి మళ్లీ రాయవలసిన అవసరము వుండదనే అతని ఊహ మరి!

ఏం చెయ్యడం?

## 3. మధుసూదన్

అనుకున్న ముహూర్తానికి శుభకార్యం కాకపోవడము పాపం మావాళ్లందరికీ రైలుఖర్చులు దండుగే కాక అనవసరప్రయాస మయింది. ఇంతవేగం మళ్లీ ముహూర్తము యెక్కడ కుదురుతుం దని అంతా తిరిగి వెళ్లిపోయినారు. ఒక్క మాపింతల్లిమాత్రము మా యింట్లోనే వుండిపోయింది, ముస్సోరీనుండి కొడుకు రెండుమూడురోజుల్లో తిరిగివస్తే కలిసి సహారంపూర్ వెళ్లిపోవచ్చునని.

ఇటు పెళ్లివారి దగ్గరినుండి ఆ అమ్మాయిజబ్బెమిటో, నిమ్మళించిందో లేదో ఏకబురూ లేదు. ఒక్కటే ఒక టెలిగ్రాము: ముహూర్తము ఆపు చెయ్యమని! ఎందుకయినా మంచిదని నే నొకసారి రాంపూర్ వెళ్ల నిశ్చయించేను. కాని వెంట ఎవరైనా మధ్యవర్తి లేకుండా వంటరిగా వెళ్లడము అంత సమంజసంగా కనిపించలేదు. మాకుమార్ ఎక్కడ వున్నా

డోగాని దగ్గర వుండివుంటే ఇప్పు డెంత పనికివచ్చును! అతను హోటలుఎడ్రస్సు తప్పుయిచ్చేడేమోగాని ముస్సోరీకి రాసిన ఉత్తరము తిరిగితిరిగి నాకే వచ్చి చేరింది. శెహరంపూర్ కూడా యింకా చేరుకున్నట్టు లేదు. తన కొడుకు వస్తే యిక్కడికి పంపించీమని పొరుగు హెడ్ మేష్టరుగారితో చెప్పి వొచ్చేనంది మా పింతల్లి.

రాంపూరుకిమాత్రం ఒక ఉత్తరం రాసిపడేశాను. ఏం కారణం తోచక, కలకత్తాకు వెళుతూ తోవలో దిగుతానన్నాను: మనకి కలకత్తాలో ఏదో పని అఘోరిస్తున్నట్టు!

* * *

తెల్లవారకట్ల ఐదుగంటలకి ఊడిపడ్డా డెక్కడినుండో కుమార్!

"ఏయే దేశములం గ్రుమ్మరితి" రన్నాను. అతగాడు నవ్వుతూ "ఏంరా మధూ, ఉత్తరమయినా రాసేవు కావు పెళ్లి అని?" అన్నాడు.

"సరిపోయింది! ఇంకా అదొకటా? మీఅమ్మ నడుగు ఎన్ని ఉత్తరములు రాసేనో. అన్నీ మచ్చ మచ్చలయి నాదగ్గరకే వచ్చిచేరేయిగాని"

"భూమిసుండ్రనిదని అనడానికి అదో బలమైన నిదర్శనం అనుకుంటాను" అని నవ్వేడు కుమార్.

"నేను ముందు రాసిన ఉత్తరము అందిందా, లేక పొరుగు హెడ్‌మాస్టర్ గారింట్లో తెలిసిందా మధూ పెళ్లిసంగతి?" అని ప్రశ్నించింది మాపింతల్లి కొడుకుని.

"ఉత్తర మేమీ నా కందలేదు. నేను అనుకోకుండా డెహ్రాడూనులో కొన్నిరోజు లుండిపోవలసి వచ్చింది. అక్కడ ముసోరీనుండి తిరిగివచ్చినమిత్రునివల్ల తెలిసింది, నాకోవుత్తరము వచ్చిందనీ, హోటలు మేనేజరు దానిని శెహరంపూరు పంపించీశాడనీ. వెంటనే నేను శెహరంపూరు వెళ్లేను. అక్కడ పొరుగు హెడ్ మేష్టరు గారింట్లో తెలిసింది నువ్విలాగ మధూ పెళ్లికని వచ్చేశావని. ముసోరీనుండి వచ్చిన ఉత్తరాన్ని మనమెవ్వరం ఇంట్లోలేకపోడాన్ని మీరట్టు పంపించేశామని వారు చెపితే వెంటనే తెల్లవారకట్ల ఫ్రాంటియరుమెయిలు నందుకొని యిలా వచ్చేను. ఆవుత్తరము యేమిటి, నువ్వురాసిందేనా, యింకెక్కడినుంచయినా వచ్చిందా?"

పెళ్లికని వచ్చి ఉత్తరంగురించి అంత ఆతృతగా ప్రశ్నించడం వింతగా కనిపించింది నాకు.

"నే రాసిందే. మరెక్కడినుంచి వస్తుంది?" అంది మాపింతల్లి.

"ఆం. లేదు, స్నేహితులెవరయినా రాసేరేమో అనుకున్నాను" అని అదోమాదిరిగా అన్నాడు కుమార్. ఆతర్వాత కొంతసే పుండి నావంక తిరిగి "అయితే ఏవూరు సంబంధము?" అన్నాడు.

"రాంపూరులోని పండిట్ విశ్వనాథంగారి కూతురు. అనుకోకుండా అప్పటికప్పుడు ముహూర్తము నిశ్చయమైపోవడంచేత చాలామంది దూరపుబంధువులకి ఉత్తరాలు రాయడానికే వేళలేకపోయింది. అంచేత ఇప్పుడీముహూర్తము పొడిగింపబడడంకూడా ఒకమంచికే వచ్చిందనుకుంటున్నాను" అన్నాను నేను.

"ముహూర్తముపొడిగింపబడడానికి కారణం?"

"ఆ అమ్మాయి కేదో హఠాత్తుగా జబ్బుచేసిందట" అన్నాను నేను.

"ఇవాళో రేపో మధు వెళ్తాడుకూడాను" అంది మాపింతల్లి.

"అవును కుమార్! సమయానికే వచ్చేవు. వెంట నువ్వుకూడా రావాలి. నువ్వు డాక్టరువని చెబుతాను. ప్రస్తుతము ఓ ఎనిమిదణాల డాక్టరువయినా అయి వుండవా? ఆ అమ్మాయిజబ్బు ఎటువంటిదయినా సరే ఎగరకొట్టేస్తాడు మాడాక్టరంటే జబ్బు నిజమయినదీ లేనిదీ తేలిపోతుంది. ఇవాళసాయింత్రమే ప్రయాణం" అన్నాను.

* * * *

మీరట్టులో ఏడుగంటలకు బయలుదేరిన బండి హాపూరుజంక్షను ఎనిమిది గంటలకు చేరుకుంది. అక్కడ బండీ మారి 'ఢిల్లీ-లక్నో - హౌరా' ఎక్స్‌ప్రెస్ ఎక్కేము. రాంపూర్ వెళ్లేసరికి ఏపదకొండున్నరో అవుతుంది, ఇక్కడే టిఫిను పుచ్చుకుందా మన్నాను.

కుమార్ నామాటలు విన్నట్టే లేదు. ఏదో ఆలోచిస్తున్నాడు. ఆరునెలల్లో బొత్తిగా మారిపోయాడతను. ముసుపటిసరదా, అంతు లేని కులాసా బాతాకానీ అతనిలో ఏమయినాయో మరి!

నేను రైలు దిగి కొన్ని పూరీలూ, కొన్ని శాందేష్‌లూ తీసుకొచ్చేను. కుమార్ తన సూటుకేసు తెరచి అందులో ఒక చిన్న డబ్బీలో వున్న ఒక ఉంగరాన్ని పదేపదే పరీక్షిస్తున్నాడు. నన్ను చూడగానే చప్పున ఆడబ్బీ పెట్టెలో పడేసి మళ్లీ యేం తోచిందో అందులోని ఉంగరం తీసి వేలికి పెట్టుకొని పెట్టె మూసి కూర్చున్నాడు. నాకేం అర్థంకాలేదు.

"ఉంగరం కొత్తదేమిటిరా? ఎప్పుడు చేయించుకున్నావు? ఇంట్లో నీవేలికి చూసినట్టు లేదే?" అన్నాను కొన్ని పూరీలూ, శాందేష్‌లూ అతనిముందర పెట్టి.

కుమార్ ఒకసారి తన ఉంగరాన్ని చూసుకొని నిర్జీవమయిన ఒక నవ్వు నవ్వేడు.

"మధూ, నీతో ఒక సంగతి చెప్తాను రహస్యంగా వుంచగలవా?"

"ఏమి టది?"

"అసలు మీరట్టు నే నొక అపోహమీద వచ్చేశాను"

నా కర్థంకాలేదు. వింతగా చూస్తున్నాను.

"నే ననుకున్నట్టంతా మధురస్వప్నములాగే తేలిపోయింది" అన్నాడు నిట్టూర్పుతో.

"ఏమిటి కుమార్, నాకేమీ అర్థమవడములేదు నీమాటలు"

"చెప్తాను విను. ఈఉంగరము ముస్సోరీలో దొరికింది"

"పాపం, ఎవరిదో!"

"వారు దొరికి తప్పిపోయారు. ఒక అమ్మాయి దీవుంగరము"

"ఓహ్హో! అలా చెప్పు. రొమాన్సులలో పడ్డావేమిటి? నీప్రవర్తనంతా చూసి అదే అనుకుంటున్నాను. ...అయితే కాయా, పండా?"

పెదవి విరచేడు కుమార్. "వాళ్లతండ్రి అడ్డు తగిలేడు."

"నేచురల్! కాని అమ్మాయిసంగతి చెప్పేవు కావు."

"ఉంగరం నావేలి కెలా గొచ్చింది?......ఆ అమ్మాయేకాదు, వాళ్ల అక్కా, బావాకూడా మనకి Favourable (అనుకూలం)గా వున్నా మరి—"

"అయితే ఇక తండ్రీ గిండ్రీ అడ్డురావడ మేమిటి 'నాన్సెన్స్'! ఆపర్ట్యూనిటీసే అసలు 'రేర్'; వచ్చింతర్వాత వాటిని 'అవైలు' చేసుకోలేకపోతే వాడు అన్—"

మావాడి అవస్థ చూసి ఆ పైమాట నే ననలేదు. మళ్లీ ప్రశ్నించేను.

"మరీ వుంగరం సంగతో?"

"అమ్మాయి పెర్మిషన్ మీద తీసుకొచ్చేను గాని రిటర్న్ చేసేయాలి."

"అదేమిటి?"

"మనకి ఛాన్సెస్ చాలా దూరమైపోయినాయి. నేను మీరట్టు అంతతొందరగా రావడానికి కారణము విను. ఆఅమ్మాయి వెళ్లిపోతున్నప్పుడు తండ్రిని వప్పించడానికి ప్రయత్నిస్తాననీ, ఫలితము వుత్తరం రాస్తాననీ చెప్పింది. శెహరంపూరుకి వుత్తర మెందుకు రావడమని నేను డెహ్రాడూనుకే రాయమన్నాను, అక్కడొక మిత్రుడి ఎడ్రస్సు యిచ్చి. నే నెన్నాళ్లు వెయిట్ చేసినా వుత్తరం రాలేదు. ఆతర్వాత తెలిసింది ముస్సోరీకి నాకొక వుత్తరం వచ్చి శెహరన్‌పూర్ తిరిగిపోయిందని. డెహ్రాడూన్ సంగతి మరిచిపోయి ముస్సోరీకి రాసిందేమోనని ఆఉత్తరము అమ్మచేతిలో పడుతుందన్న భయముతో రాత్రిరాత్రి శెహరన్‌పూర్ పరుగెత్తేను. అక్కడ పక్కింటివాళ్లవల్ల తెలిసింది అమ్మనీ పెళ్లికి మీరట్టు వెళ్లినట్టూ, నావుత్తరముకూడా అక్కడికే రీడైరెక్టు చేయబడ్డట్టూ. ఆ ఉత్తరంకోసం ముఖ్యంగా వచ్చేశాను మీరట్టు. చివరకి ఆమె రాయేలేదని తేలింది" అని విషణ్ణభావంతో కూచున్నాడు కుమార్.

నాకు కొంచెం నవ్వు వచ్చింది అతని ఉత్తరం వేటకి. "అయితే ఆ అమ్మాయి నివాసము?" అన్నాను.

"మురాదాబాదులో వాళ్ల అక్కదగ్గ రుంటున్నది. అక్కడ స్కూల్లో చదువుకుంటున్నదట. అంతకన్నా నాకు హెచ్చు తెలియదు".

"అలాగా? మాఅత్తవారివూరికి ముందుజంక్షనే! నాయీ పెళ్లిసంగతేదో తేలిపోనీ, కుమార్, ఆపిల్ల సంగతి వాకబుచేద్దాము"

"ఇంకొక సంగతి. నువ్వు నవ్వుతావేమిటోగాని ఒకనాడు ఒక యోగి ఆకొండల్లో మాయిద్దర్నీ చూసి 'శీఘ్రమేవ కల్యాణసిద్ధిరస్తు'అని దీవించాడు. అదొకటి—"

నాకు నిజంగానే నవ్వు వచ్చింది.

"అయితే ఫక్తు ప్రబంధఫక్కీలో జరిగిందన్న మాటే అంతా? యోగి అయిపోయినాడు, అదే పార్వతీపరమే—"

"నీకు హాస్యంగా వుందేమోగాని—"

"లేదు కుమార్, వుత్తనే అన్నాను. ఆ అమ్మాయిని నీ కాళ్లముందర తెచ్చివేస్తాను చూస్కో నాతడాఖా"

"ఆ యోగిమాటలు నమ్మేనని కాదు—"

"అమ్మమ్మ! అలాగనకు. ఏపుట్టలో ఏపాముందో! ఆహారిద్వారం ఆపక్క యోగులమాటల్లో చాలా సత్యముం దంటారు."

ఇలా మాట్లాడుకొంటూవుండగానే మురాదాబాదుజంక్షను వచ్చింది. అప్పటికప్పుడే పదిన్నర అయింది. నేను ప్రయాణాల్లోని అలవాటుప్రకారము రెస్టారెంటులో దూరి ఒక బుడ్డీ తీసుకొచ్చేను.

కుమార్ నన్ను చూసి "మధూ! ఇంకా వదిలేవు కావు, యీఅలవాటు? అత్తవారింటికి వెళ్లుతూ ఏమిటిది?" అన్నాడు.

"డాక్టరు చదువుతుండి ఇంకా దీని పరిచయము లేకపోవడము...నీ వొక్కడవే కనిపిస్తున్నావు" అని నవ్వి ఒక పెగ్గు తగిలించి మిగతాది పెట్టెలో దాచేశాను.

* * *

సుమారు పండ్రెండుగంటలరాత్రికి విశ్వనాథ్ గారింటికి చేరుకున్నాము. మావాడు మెట్లెక్కి తలుపు తట్టేడు. అల్లుణ్ణి కదా అని నేను దర్జాగా వెనకనే వుండిపోయినాను. రెండునిముషా లయింతర్వాత లాంతరు పట్టుకొని ఒక పాతికేళ్ల అమ్మాయి తలుపుతీసింది. ఆవిడ మావాణ్ణి చూసి ఎందుకో ఎలెక్ట్రిక్ షాక్ తగిలినట్లు త్రుళ్లిపడి వెనుకనే వున్న నన్నూ చూసి లోనికి పరుగెత్తింది లాంతరు అక్కడ వదిలేసి.

మావాడు యెంతసేపటికీ లోపలికి వెళ్లక శిలాప్రతిమలాగ నిలబడ్డాడు ద్వారమువద్దే. లోనికి రమ్మని మర్యాద ఎవ్వరూ చెయ్యలేదని తటపటాయిస్తున్నాడని "అర్ధరాత్రివేళ మర్యాద యేమి"టని నేను అతన్ని లోనికి తోసి దారితీసేను.

ఇంతలో మామనుగారూ, అత్తగారూ వచ్చి పలకరించేరు.

"కూచోండి, కాఫీ పెట్టిమ్మన్నారా?" అన్నారు. ఇద్దరి మొహాల్లోనూ ఏదో భయమూ, బెంగా కనిపించేయి. తలుపుచాటునుంచి చూస్తున్న పాతికేళ్ల అమ్మాయి మొహంలోకూడా ఏదో దిగులు మూర్తీభవించివుంది. ఇంటిల్లిపాదీ నన్ను చూసి యెందుకిలా గవుతున్నారో తెలీడంలేదు. నేను విశ్వనాథంగారినీ— ఎప్పుడో ఒకటి రెండు సార్లు—ఆయన రెండవ కుమార్తెనీ తప్ప మిగతవారి నెప్పుడూ చూడలేదు.

"మాకు కాఫీ ఏమీ అక్కర్లేదు. పడుకుంటా"మన్నాను.

ఆమాటయినా మాకుమార్ అంటాడేమో అని చూసేనుకాని అత నంతకన్న బిక్కజచ్చి కూచున్నాడెందుకో.

మామామగారు లోనికి వెళ్తూ ద్వారంవద్దనున్న అమ్మాయితో "మేడమీద మనూని లేపి వీరిద్దరికీ ఆగదిలో పక్కలు సిద్ధము చెయ్యమ్మా"అన్నాడు.

"మనూ...!" అని కుమార్ గొణుక్కున్నట్టయింది. అది నాకాబోయే పెళ్లాంపేరని అతనికి పాపం తెలియదు! అన్నట్టు ప్రసంగాల్లో పడి నా పెళ్లాంపేరయినా చెప్పేనుకానేమి టనుకున్నాను.

ఇద్దరికీ మేడమీద మంచాలు ఏర్పాటు చేసేరు. అంతరాత్రివేళ ఏ ప్రసంగము యెత్తినా బాగుండదని నిశ్శబ్దంగా పడుకుందుకి వెళ్లిపోయినా మిద్దరమూను.

కుమార్ యెందుచేతనోగాని అడుగడుక్కీ తడబడుతున్నాడు. ఈ యింటికి రాగానే వీరందరి జబ్బా యితనికి పట్టుకుందికాబోలు. డాక్టరని తెచ్చుకుంటే బాగానే సహాయము చేసినట్టున్నా డనుకున్నాను. ఎందుకయినా మంచిదని ఓ చుక్క వేసుకోమన్నాను, గాని లాభం లేకపోయింది. ఉట్టి సత్యకాలపుమనిషి! నేను మాత్రం కొంత బిగించి పరుపుమీద పడుకొని కళ్లు మూసుకున్నాను. మూసుకున్నానేగాని నిద్దర మాత్రము పట్టడములేదు. మర్నాడు ప్రసంగము ఎలా గెత్తుదామా అని ఆలోచిస్తున్నాను. అసలు నాకు పరాయిచోట నిద్దరపట్టని రోగ మొకటుంది.

కొంతసేపు అటూ యిటూ దొర్లేను. ఇంతలో పైన ఏవో గుసగుసలు వినిపించేయి.

"అదిగోనే చూడు" అని ఒక స్త్రీకంఠము! నా పెళ్లానికి నన్ను చూపుతున్నారు కాబోలని Full view (సంపూర్ణదృశ్యం) యివ్వాలని అటువాడి నల్లా ఇటు ఒత్తిగిలేను. వచ్చినవా రెవరో గబగబ మెట్లు దిగిపోయినట్టయింది. ఈ మధ్యరాత్రివేళ వారు రావడం నాకు కొంత ఆశ్చర్యాన్ని కలిగించింది.

అటు కుమార్‌పక్క చూస్తే అతను దెయ్యం పట్టినవాడిలా చూస్తున్నాడు నావంక.

"ఏంరా, నిద్దరపట్టడము లేదూ?" అన్నాను.

"ఆఁ — లేదు — కాని మధూ, నాలుగోతారీకునా మొదట ముహూర్తము నిశ్చయమైంది?"

"అవును, ఇప్పు డా ప్రసక్తి యెందుకు వచ్చింది?"

"అబ్బే! యేమీ లేదు"

"నీ ప్రవర్తన యేమిటో వింతగా కనిపిస్తున్నది. వంట్లో బాగులేదా యేమిటి?"

"... ... ..."

"ఒరేయి, నామాట విని ఓచుక్క వేసుకో. ఈ యింట్లోనే యేదో చెడుగ్రహ మున్న దని నా నమ్మకము. లేకపోతే ఒక్క పెళ్లికూతురుతో ప్రారంభించిన జబ్బు అందరినీ పట్టుకోవడ మేమిటి? తెల్లవారేసరికి నాకూ దాపరిస్తుందో ఏమిటో గోల! రేపు సాయంత్రమే ఏదో వేగం సెటిల్ చేసుకొని పోవాలిగాని — "

కుమార్ నామాటలు వింటున్నట్టే కనిపించలేదు. అతనికి పాపం ముస్సోరీ రోమాన్సు జ్ఞాపకానికి వస్తున్నది కాబోలు. ఆ అమ్మాయి గురించి సీరియస్‌గా ఎంక్వయరీ చేద్దామని నాలో నేనే నిశ్చయించుకున్నాను.

ఎంతసేపటికీ నిద్దరపట్టక నేను పెట్టెతీసి మరి కొంత స్వీకరించి పడుకున్నాను. కింద మళ్లీ గుసగుసలు వినవచ్చేయి. "లేదు లేదు. మనూనే మాటాడనీయవే" అని వెనుకటి స్త్రీకంఠమే! ఆ మాటలు విని— ఇంకా నిద్దరపట్టడములేదు కాబోలు నాలాగే — తటాలున లేచి కూచున్నాడు కుమార్ ఆడబిడ్డ బొమ్మలాగ! పక్కన నేను మేలుకొని వుండడము చూసి మళ్లీ మెల్లగా పడుకున్నాడు. నా కేమీ అర్థం అవడములేదు. చూస్తూంటే నాకు మతిపోతున్నదో, మిగతావారికి మతిపోతున్నదో తెలియడములేదు. నాకాబోయే పెళ్లాం జబ్బుసంగతి దేవుడెరుగునుగాని రేపు మావాడినే ముందు యే డాక్టరుదగ్గరికయినా తీసుకోవెళ్లా లనుకున్నాను.

ఇంతలో కుమార్ నావంక చూసి "మధూ! ఎంతయింది టైమ్"మన్నాడు. నేను కిటికీమీద పెట్టిన రిస్టువాచీ అందుకొని చూసి రెండుంపా వన్నాను.

"మధూ, నాలుగున్నరకో అయిదుకో డాక్ ఢిల్లీ ఎక్స్‌ప్రెస్ వుందికాబోలు. నే వెళ్లిపోతున్నాను. అర్జంటుపని వున్నది."

"అదేమిటి కుమార్? ఇప్పటి కిప్పుడు ఏ అర్జంటుపని జ్ఞాపకానికి వచ్చింది? అయినా వీళ్లతో చెప్పకుండా వెళ్లిపోతే బాగుంటుందా? రేపు నేనూ వస్తున్నానుగా!"

కుమార్ నూరువంక వెఱ్ఱిగా చూస్తున్నాడు. అతని వాలకమంతా చూస్తే అతని కేదోరకమయిన వెఱ్ఱే ప్రవేశించినట్టుంది. వాడి మేనమామ వెఱ్ఱియెత్తి

పోయినప్పుడు సరిగ్గా అలాగే చూసేవాడు. Disappointed love (భగ్నప్రేమ) ఒక్కొక్కప్పుడు వెఱ్ఱికిందకి దింపుతుందనికూడా విన్నాను. నాకు వెఱ్ఱి వాళ్ళంటే వుపద్రవమయిన భయం. ఇక ఆరాత్రి మా వాడితో ఆర్గ్యుమెంట్ మంచిది కాదని గుప్‌చుప్‌గా ముసుగు తన్నేసి కళ్లు మూసుకున్నాను.

*        *        *        *

అలా ఎప్పుడు నిద్దరపట్టిందో, ఎంతసేపు పడుకున్నానో గాని హఠాత్తుగా యెందుకో తెలివివచ్చింది! పక్కన కుమార్ కనిపించలేదు! వెఱ్ఱి యెక్కువయిపోయి వరండాలోంచి కిందికి గెంతేశాడో యేమిటో అని లేచిచూసేను. వరండావైపు వెళ్లకముందే పక్కగదిలోని అలికి డేదో నన్నాకర్షించింది. ఏవో మెల్లిగా మాటలు వినవస్తున్నాయి.

"ఏమయినా, మించిపోయిం దిప్పుడు"

అది మావాడి గొంతుకే! మాటల్లో నిరుత్సాహం కనిపిస్తున్నది.

ఎవరితో మాట్లాడుతున్నాడు చెప్మా ఈరాత్రిలేచి అని నాకాశ్చర్యంవేసి, తలుపుసందులోంచి చూసేను. గదిలో దీపము తగ్గించేసివున్నా కుమార్, మాకుతలుపు తీసిన పాతికేళ్ల అమ్మాయీ స్పష్టంగా కనిపిస్తున్నారు. ఇంకెవరో మూడవవ్యక్తికూడా ఆమె వెనకనే నిలబడ్డట్టుంది! వారంతా అక్కడ ఏమిటి చేస్తున్నారో, రాత్రి రాత్రిలేచి మాకుమారు వాళ్లతో ఏమిటి మాటాడుతున్నాడో తలాతోకా అర్థమవలేదు. ఒకరి కెత్తింది; ఇద్దరి కెత్తింది; క్రమంగా అందరికీ యెత్తినట్టేవుంది! ఆవెనకనున్న వ్యక్తి తలయెత్తి ఏమిటో అంటున్నది హీనస్వరములో.

"ఆ ప్రయాణపుతొందర్లో ఎక్కడ పోయిందో ఆకాగితము మరి కనిపించలేదు, యెంత వెతికినా. అంచేత—"

అరె! నాభార్య లాగుందే! అదిగో! నాక్కాబోయే భార్యే! మావాడితో మాట్లాడుతున్నదా? నాకు డోసు యెక్కువయి అలా కనిపిస్తున్నదా, లేక—?

మళ్లీ కుమార్‌గొంతుక. నిట్టూర్పు విడిచి యేమిటో అంటున్నాడు.

"ఇప్పుడు నే నేం చెయ్యగలను? ఇతడు నా పెత్తల్లికుమారుడు. పెళ్లిముహూర్తము నిశ్చయించు కుందుకి సర్వసిద్ధమయి వచ్చేడు—"

నే నేమిటి వింటున్నానో నాకు తెలీసంలేదు. ఆ పాతికేళ్ల అమ్మాయి — మావదినెగారే అయివుంటుంది—చాలా దీనంగా ప్రార్థిస్తున్నట్టుంది.

"కుమార్ బాబూ! మనూసంగతి మీ రెరుగుదురు. ఉంగరం పారేసింది ఉత్తరం పారేసిందంటే ఆశ్చర్యము లేదు. ఈయన మీ పెత్తల్లికుమారుడని చెబుతున్నారు. జరిగిందంతా తెలిస్తే మీయిరువురిమధ్యా అడ్డువస్తారని తోచదు."

మావాడు చెప్పిన మిస్సోరీవృత్తాంతము పూర్తిగా జ్ఞాపకానికి వచ్చింది! నేను కొయ్యఅయిపోయినాను!

లోన అస్పష్టంగా ఆస్త్రీకంఠమే వినవస్తున్నదింకా. "నాడు రోగి మీయిరువురి నుద్దేశించే—"

మరి వినదలుచుకోలేదు.

కళ్లు చీకట్లు కమ్మేయి. అప్రయత్నంగా కాళ్లు తీసుకొనివెళ్లి నన్ను పరుపుమీద కూలవేసేయి! జరిగినదంతా ఒక్కక్షణంలో కళ్లకు కట్టినట్లు తెల్లమయింది. తలుపుతీయగానే మాకుమార్, వాళ్ల పెద్దమ్మాయీ ఒకర్నొకరు చూసి కొయ్యబారిపోవడం స్ఫురణకు వచ్చింది.

ఇదంతా నాకు ముందే యెందుకు తట్టలేదో నాకే ఆశ్చర్యంగావుంది. బుడ్డీమహావల్లనో, నిద్దరలేక పోవడంచేతో ఆలోచన సరిగ్గా వెళ్లివుండదు.

ఎంతపని జరిగింది! అనుకోకుండా వారిద్దరి ప్రేమనాటకములో జొరబడి యెంత గగ్గోలుచేశాను! చెదరిపోయిన మనసుని కూడదీసి ఆలోచించాను. ఇప్పు డేది కర్తవ్యం? కుమార్‌ని అంతగా ప్రేమించిన ఆ అమ్మాయిని నేను చేసుకుంటేమాత్రం నా కేమిటి సుఖం?

వాచీ చూసేను. పావుతక్కువ నాలుగయింది. డౌన్ఎక్స్‌ప్రెస్సును సుళువుగా అందుకోవచ్చు.

కమీజు వేసుకొని హేండుబ్యాగుమాత్రం పట్టుకొని బయలుదేరేను.

* * *

స్టేషనులో యింకా ఏమీ అలుకుడులేదు. పోస్టుబేగులు బండీలో ఈడ్చుకుంటూ అప్పుడే వచ్చేడు పోస్టుప్యూను. స్టేషనులోనున్న పోస్టుబాక్సుని తెరుస్తున్నాడు. Early morning delivery (ఉదయపు బట్వాడా) వుందని తెలుసుకుని గబగబ ఒక కాగితము తీసి ఉత్తర మొకటి ప్రారంభించేను:

"మురాదా' R. S. ౯-౬-౪౧.

కుమార్,

నాకంతా విశదమయింది. బంగారులాంటి పిల్లను win (జయిం)చేశావు. నా అభినందనాలు. నీ మన్సోకీరోమాన్సు నావల్లనే స్పాయిల్ అయిపోవడం చాలా విచారంగా వుంది. నన్ను క్షమిస్తావనుకుంటాను. నేను మనస్ఫూర్తిగా ఫీల్డులోంచి withdraw అవుతున్నాను (తప్పుకుంటున్నాను).

నేను రెయిలులో చేసిన వాగ్దానము జ్ఞాపకముండే వుంటుంది. అది ఈరీతిగా నెరవేర్చుకుంటున్నాను.

మామగారి కీవుత్తరం చూపించి ముహూర్తము వేగంస్థిరపరుస్తే మీ అమ్మా, నేనూ మిగతాబంధువులతో వస్తున్నాము. —మధు.

P. S. నానుంచి కలిగిన తాత్కాలిక మనోవికలత్వానికి నీభార్యకు నాక్షమాపణలని చెప్పు.

—మధు"

౪. మాలతి

నిజంగా మధుసూదన్‌గారి త్యాగము ప్రశంసింపతగ్గది. ఆయనకి మాపింతల్లికుమార్తె లలిత నిచ్చి వివాహము చెయ్యాలన్న ఆలోచన అందరి ఆమోదమూ పొందింది. ఇరుపక్కలవారూ వప్పుకున్నందున రెండు పెళ్లిళ్లూ ఒకేసారి మాయింట్లోనే చెయ్యడానికి యేర్పాట్లు జరుగుతున్నాయి.

ఈశుభవర్తమానము మావారికి రానేను, మన్సోకీలో కుమార్‌బాబుకి ఓపిల్లని చూడు అని తాము నాపైవేసిన కార్యభారాన్ని జ్ఞాపకంతెస్తూ.

పెళ్లికి కొంచెము ముందుగానే వచ్చేశారు మావారు మురాదాబాదునుండి. ఎవరి సందర్భలో వారుంటూంటే యేలా సంపాయించేరో మనూ పోస్టు చెయ్యకుండా వుంచిన వుత్తరం! తీసి చదివేశారంతా. పోనీ, చదివి ఊరుకున్నారా? మనూదగ్గరకి వెళ్లేరు. "ఏమమ్మా మనూ! కొండమీద పుట్టిన ప్రణయసరణి 'గట్టుదాటీ, ఘట్టదాటీ, ఘనమయినా'—" మను కొంచెము దిగాలుపడి వారిచేతిలోని వుత్తరము చూసి ఛటుక్కున లాక్కుంది. పక్కగదిలోకి వెళ్లి తన పెట్టెలో అది దాచేస్తూ "తనవి కాని వుత్తరాలు చూసి చదవడం యేసెక్షనుకింద వస్తుందో! మునసబులు 'లా'కు బద్ధులు కారుకాబోలు" అంది బావని చురచుర చూస్తూ.

బావామరదళ్ల కటువంటి హాస్యం మొదటినుంచీ అలవాటే. అయినా కొంచెము కోపం తెచ్చుకున్నట్టన్నాను మావారితో.

"ఏమి టాచిన్నతనం చెప్పండి? దాని వుత్తరాలు మీ కెందుకు!"

నామాట వినిపించుకుంటేనా!

ద్వారంవద్ద నిలబడ్డ మరదల్ని చూస్తూ చూస్తూ ఇంకా ఏమిటో అంటున్నారు.

"వెనుక నొకవికుమారు డన్నట్టు —
విరియం బూచిన నీ గులాబి హృదయా
వియ్యూభత సౌరభ్య మీ
ధరణిన్ ఏమహనీయు ప్రేమరసపా
త్రం బౌచు వర్ధిల్లెనో
కరమాహ్లాదము ప్రేమితాత్ముల కొసం
గంజాలె నీ నాటికిన్
దరుణీ—"

బావగారిని తప్పించుకొని వెనుకయింటిలోనికి పారిపోయింది మనూ.